ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

21-12-2024 శనివారం సంపుటి: 30 సంచిక: 323 పేజీలు: 8+16 వెల: 6.50



దేశంలో పెరుగుతున్న మందిర్, మసీదు వివాదాలు 5లో

రష్యా దాడులతో ఉక్రెయిన్ ఉక్కిరిబిక్కిరి


# కెటిఆర్‌పై కేసు



## 'ఫార్ములా ఇ-కార్ రేసు' కేసులో కీలక పరిణామం

### మనీలాండరింగ్, ఫెమా కింద ఇడి కేసు నమోదు

### ఎసిబి ఎఫ్ఐఆర్ ఆధారంగా రంగంలోకి ఇడి

### ఎ-1: కెటిఆర్, ఎ-2: అరవింద్ కుమార్, ఎ-3: బిఎల్ఎన్ రెడ్డి

### బ్రిటన్‌లోని ప్రైవేటు సంస్థకు అడ్డగోలుగా రూ. 45 కోట్లు బదలీ

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుపై శుక్రవారం రాత్రి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫార్ములా ఈ కార్ రేసులో అక్రమాలు జరిగాయని ఎసిబి కేసు నమోదు చేసిన 24 గంటల తరువాత కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) మరో కేసు నమోదు చేసింది. ఎసిబి కేసులో బిఆర్ఎస్ నేత మాజీ మంత్రి కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండిఎ విశ్రాంత అధికారి బిఎల్ఎన్ రెడ్డిలు నిందితులుగా వుండడం తెలిసిందే. ఎసిబి నమోదు చేసిన కేసులో తనను అరెస్టు చేయకుండా కెటిఆర్ హైకోర్టు నుంచి శుక్రవారం సాయంత్రం ఆదేశాలు పొందిన కొన్ని గంటలకే ఆయనపై ఇడి మనీ లాండరింగ్ చట్టం, ఫెమా ఉల్లంఘన కింద కేసు నమోదు చేయడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించి ఇసిఐఆర్ కూడా వెలువడ్డాయి. ఇడి నమోదు చేసిన కేసులో ఎసిబిలో వున్నట్లుగానే ఎ1గా కెటిఆర్, ఎ2గా సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండిఎ విశ్రాంత అధికారి బిఎల్ఎన్ రెడ్డిలు నిందితులుగా వుండడం గమనార్హం. ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి గురువారం నాడు ఎసిబి కేసు నమోదు చేయడం విదితమే.

దీనికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌తో పాటు ఇప్పటి వరకు ఎసిబి సేకరించిన అన్ని వివరాలను తమకు ఇవ్వాలని ఇడి అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఎసిబి అధికారులను కోరారు. అనంతరం ఈ వివరాలు సాయంత్రం వరకు అందగానే వెంటనే మనీలాండరింగ్ చట్టం, ఫెమా ఉల్లంఘన చట్టంపై కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండిఎ >>2



## 30 దాకా కెటిఆర్‌ను అరెస్టు చేయొద్దు

### హైకోర్టులో ఊరట

### 27న తదుపరి విచారణ

### ఎసిబి దర్యాప్తు కొనసాగింపు

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి ఎసిబి నమోదు చేసిన కేసులో బిఆర్ఎస్ నాయకుడు కెటిఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఈకేసులో మొదటి నిందితుడుగా వున్న కెటిఆర్ తనపై ఎసిబి నమోదుచేసిన కేసును కొట్టి వేయాలని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై శుక్రవారంనాడు హైకోర్టులో సుధీర్ఘ వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా అటు కెటిఆర్ న్యాయవాది ఇటు అడ్వకేట్‌జనరల్ సుదర్శన్ రెడ్డి ఫార్ములా ఈకార్ రేసుకు సంబంధించి >>2



## 'కార్' రేసులో రూ. 600 కోట్ల లూటీకి యత్నం

### ఆ ప్రతినిధి వచ్చి కలిసాకే స్కామ్ బట్టబయలు

### ఎక్కడైనా చర్చకు సిద్ధం: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు20:** ఫార్ములా ఈ కార్ రేసులో రూ. 600 కోట్లు లూటీ చేసేందుకే మాజీ మంత్రి కెటిఆర్ కుట్రలు చేశారని దానిని తాము అడ్డుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఫార్ములా ఈ కార్ రేస్‌పై రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్ఎండిఏ నిధులు విదేశాలకు ఎలా వెళతాయని ఆయన ప్రశ్నించారు. ఈ కార్ రేస్ సంస్థతో కెటిఆర్‌కు లోపాయికారీ ఒప్పందం జరిగిందన్నారు. ఈ కార్‌రేస్ సంస్థకు చెందిన వ్యక్తి అపాయింట్ మెంట్ అడిగితే నేనే ఇచ్చా.. వారు చెప్పాకే వ్యవహారం ఏంటనేది అధికారులతో తెలుసుకున్నా...ఎసిబి విచారణ చేస్తున్న సమయంలో, కోర్టులో వాద నలువినిపిస్తున్న సమయంలో విచార >>2



## పార్లమెంటు నిరవధికంగా వాయిదా

**న్యూఢిల్లీ, డిసెంబరు 20:** పార్లమెంటు శీతాకాలసమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి. అత్యంత కీలకమైన వన్‌నేషన్ వన్ ఎలక్షన్‌కు సంబంధించిన బిల్లులు సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించేందుకు ఆమోదం తెలపడంతో ఉభయసభలు వాయిదా పడ్డాయి. శీతాకాల సమావేశాలు ప్రారంభంనుంచి కూడా విపక్షాల నిరసనలతో అధికారపక్షం ప్రతిదాడులతోనే కాలంగడిచిపోయింది. మూడో సెషన్‌లో 65 గంటలు మొత్తం మూడుసెషన్లలో 70 గంటలకుపైగా సమయం వృధా అయినట్లు తేలింది. నవంబరు 25న ప్రారంభం అయిన శీతాకాల సమావేశాలు మూడు విడతలుగా కొనసాగాయి. డిసెంబరు 20వతేదీతో ముగిసాయి. 19వ తేదీ లోక్‌సభలో వాగ్వాదాలు ప్రతిపక్ష ఎంపిల నిరసనల నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు శుక్రవారం ముగి >>2



## హర్యానా మాజీ సిఎం చౌతాలా కన్నుమూత

**చండీఘర్, డిసెంబరు 20:** హర్యానా మాజీ ముఖ్యమంత్రి, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ చీఫ్ ఓంప్రకాశ్ చౌతాలా(89) కన్నుమూసారు. గురుగ్రామ్‌లోని ఆయననివాసంలో శుక్రవారం గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. 1989 నుంచి 2005 వరకూ హర్యానా సిఎంగా ఆయన బాధ్యతలు నిర్వహించారు. ఓంప్రకాష్‌చౌతాలా 1935లో జన్మించారు. ఆయనభారత దేశానికి ఆరో ఉపప్రధానిగా పనిచేసిన చౌదరి >>2

## పార్లమెంటు ఘటనలు దురదృష్టకరం: కిషన్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** పార్లమెంటు ఆవరణలో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపిల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపిలు చంద్రప్రతాప్ సారంగి, ముకేశ్ రాజ్‌పుత్‌లను కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, రాజ్యసభ ఎంపి, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌లు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఇప్పుడు ఆ పార్టీ >>2

## కార్పొరేషన్లుగా మహబూబ్‌నగర్ మంచిర్యాల

### కొత్తగా 12 మునిసిపాలిటీలు

**హైదరాబాద్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా రెండు కొత్త మున్సిపల్ కార్పొరేషన్‌లకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. మహబూబ్ నగర్, మంచిర్యాల మున్సిపాలిటీలను కొత్తగా మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేసింది. అదేవిధంగా కొత్తగా 12 మున్సిపాలిటీలు రానున్నాయి. సంగారెడ్డి జిల్లాలో కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం, జనగాంజిల్లాలో స్టేషన్ ఘన్‌పూర్, నారాయణపేటజిల్లాలో మద్దూర్, ఖమ్మంజిల్లాలో ఏదులాపురం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వరావుపేట, మహబూబ్ నగర్ జిల్లాలో దేవరకద్ర, రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మెయినాబాద్‌లు అప్‌గ్రేడ్ అయ్యాయి. పలు గ్రామాలను సైతం విలీన ప్రక్రియను చేపట్టారు. పరిగి మున్సిపాలిటీలో మరో ఆరుగ్రామాలు, నర్సంపేటలో ఏడు గ్రామాలు, నార్సింగిలో ఒకటి, శంషాబాద్‌లో ఒక గ్రామం విలీనం, కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మరో ఆరు గ్రామాల విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది.

## కెటిఆర్ తొలి విజయం సాధించారు

### కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసు డొల్ల అని తేలింది

### హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్నా: హరీష్

7లో

## 'ఫార్ములా రేసు' కేసుపై ఎసిబి విచారణ వేగవంతం

### ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందం

### హెచ్ఎండిఎతోపాటు పలు శాఖలనుంచి పత్రాలు సేకరణ

7లో

# భూభారతికి అసెంబ్లీ ఆమోదం



శుక్రవారం అసెంబ్లీ వద్ద స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను సన్మానిస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు

### భూవివాదాల పరిష్కారానికి ల్యాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు

### చట్టంలో పట్టాదారులు, అనుభవజ్ఞులకు సముచిత స్థానం

### స్పీకర్‌ను సన్మానించి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు20:** దేశానికే తలమానికంగా రూపొందించిన తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్ బిల్లు, 2024) శుక్రవారం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. సామాన్య రైతులను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ చట్టాన్ని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ నెల 17న అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై శుక్రవారం అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించారు. చర్చలో కాంగ్రెస్‌తోపాటు బిజెపి, సిపిఐ, ఎంఐఎం సభ్యులు పాల్గొన్నారు. చట్టంపై పలు సూచనలను చేశారు. భూభారతికి సంబంధించి చట్టం ఉద్దేశాలు, లక్ష్యాలను సభకు మంత్రి పొంగులేటి వివరించారు. ఇందులో సామాన్యులకు ఉచిత న్యాయ సలహాలు కూడా అందించే వ్యవస్థకు రూపకల్పన చేశారు. కాగా, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా భూమాతకు బదులుగా 2024లో యూపిఏ ప్రభుత్వ హయాంలో డిజిటల్ ల్యాండ్ రికార్డుల అప్ డేషన్ కార్యక్రమానికి పెట్టిన భూ భారతి అని చట్టానికి పేరు పెట్టారు.

2020 ఆర్వోఆర్ చట్టం (ధరణి) లోని తప్పులను కొత్త చట్టం భూభారతి సరిదిద్దుతుంది. రాష్ట్రంలో భూముల సమస్యలకు కొత్త చట్టంశాశ్వత పరిష్కారం చూపిస్తుంది. భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. కొత్త చట్టం రూపకల్పనకు 18 రాష్ట్రాల్లో ఉన్న ఆర్వోఆర్ చట్టాలను అధ్యయనం చేసింది. చట్టం ముసాయిదాను కూడా ప్రకటించి ప్రజల నుంచి సలహాలు, సూచనలను కూడా స్వీకరించింది. పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో పైలెట్ ప్రాజెక్టును నిర్వహించింది.

విస్తృత స్థాయిలో చర్చలు జరిపి మేథోమధనం చేసి ఈ చట్టాన్ని రూపొందించింది. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో వివాదస్పదమైన 18 లక్షల ఎకరాల భూములనుపార్టు (బీ) పేరుతో పరిష్కరించకుండా పెండింగ్‌లో పెట్టారు. ఈ భూ భారతి చట్టం వీటికి పరిష్కారం చూపిస్తుంది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని ఆబాదీ/గ్రామ కంఠం సమస్యలను ఈచట్టం పరిష్కరిస్తుంది. భవిష్యత్తులో భూవివాదాలకు >>2




శుక్రవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ముర్ము ఇచ్చిన ఎట్‌హోం విందుకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తదితరులు

## రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోమ్'

### హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్, మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు20:** బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం సాయంత్రం ఎట్‌హోమ్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, పొన్నం ప్రభాకర్‌గౌడ్, సీతక్క, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాధే, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు ఎట్‌హోమ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అందరికీ మర్యాదపూర్వకంగా అభివాదం చేశారు.



శుక్రవారం సంగారెడ్డి జైలునుంచి విడుదలై బయటకు వస్తున్నరైతులు

## సంగారెడ్డి జైలు నుంచి లగచర్ల రైతులు విడుదల

### భారీగా స్వాగతం పలికిన గిరిజన సంఘాల ప్రతినిధులు

**సంగారెడ్డి, డిసెంబరు 20 (ప్రభాతవార్త) :** లగచర్లలో అధికారులపై దాడి కేసులో అరెస్టయిన రైతులు, సంగారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా గిరిజనసంఘాల ప్రతినిధులు వారికి స్వాగతం పలికారు. రైతులకు 2 రోజుల క్రితం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల వారి విడుదలలో జాప్యం జరిగింది. వాస్తవానికి వీరు గురువారమే విడుదల కావాల్సి ఉంది. బెయిల్ పత్రాలు సిద్ధం కాకపోవడంవల్ల విడుదలలోజాప్యం చోటు >>2

# బయటకు రా.. చూస్కుందాం

### అధికార, విపక్ష నేతల సవాళ్లు, ప్రతి సవాళ్లు

### అసెంబ్లీలో తీవ్ర గందరగోళం, రెండు సార్లు వాయిదా

### కాగితాలు చింపివేత, స్పీకర్‌పై పుస్తకాలు విసిరిన ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, డిసెంబరు 20,ప్రభాతవార్త:** ఫార్ములా ఈ రేసుపై చర్చ విపక్షం పట్టుబట్టడంతో అసెంబ్లీలో యుద్ధ వాతావరణం నెలకొంది. అధికార విపక్ష సభ్యులు బయటకు రా తేల్చుకుందా అంటూ సవాళ్ళు ప్రతి సవాళ్ళతో వాగ్వాదంకు దిగారు. స్పీకర్ పోడియంవైపు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూసుకెళ్ళి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఫార్ములారేసుపు చర్చ చేపట్టాలని నినాదాలు ఇవ్వడం మొదలు పెట్టారు. "ప్రభుత్వహామీలు, లఘుచర్ల సంఘటనలపై నిలదీస్తే అక్రమ కేసులా" అంటూ నినాదాలతో సభ హోరెత్తింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే స్పీకర్ పోడియం వద్ద నిరసనకు దిగడంతో మార్షల్ రంగ ప్రవేశం చేసి వారిని అదుపు చేసే ప్రయత్నంచేశారు. స్పీకర్ ప్రసాద్ మాత్రం భూభారతి బిల్లు కోట్లాది ప్రజల భవిష్యత్‌తో ముడి ముడిపడి ఉందని ఒక వ్యక్తికి సంబంధించిన కేసు కోసం సభా సమయం వృధా చేయలేమని స్పష్టచేశారు.

కౌశిక్‌రెడ్డి దీనితో రెచ్చిపోయి పేపర్లుచించి స్పీకర్‌పైవేస్తూ పవిత్ర సభను కిష్కింద కాండ చేశారు. అంతేకాదు స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకొని పుస్తకాలు విసిరారు. కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు చాలాసేపు సంయమతనంతో వ్యవహరించారు. ఎప్పుడైతే స్పీకర్‌పై పుస్త కాలు విసిరారో కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ రెచ్చిపోయి బాటల్ విసిరి దౌర్జన్యానికి దిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అధికార పార్టీ ఎమ్మెల్యే శంకర్ వాటర్ బాటిల్, పేపర్లు విసిరారు. మరో అధికార పార్టీ ఎమ్మెల్యే విపక్ష సభ్యులకు చెప్పు చూపే ప్రయత్నం చేయగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆ సభ్యుడిని వారిని బయటకు లాక్కువెళారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే తమకు చెప్పు చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఆరో రోజు శుక్రవారం అసెంబ్లీ సమావే శాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫార్ములా ఈ కార్‌రేస్‌పై సభలో చర్చించాలని బీఆర్ఎస్‌పట్టుపట్టింది. సమావేశాలు జరుగుతున్నప్పుడు కెటిఆర్‌పై కేసు పెట్టారని, అక్రమ కేసు పెట్టినప్పుడు ఆయనకు చెప్పుకునే అవకాశం ఇవ్వాలని హరీశ్ రావు స్పీకర్‌ను కోరారు. దీనికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిరాకరించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన >>2




శుక్రవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతున్న దృశ్యం

## కెటిఆర్ తొలి విజయం సాధించారు

### హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్నా: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 20:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసు డొల్ల కేసు అని తొలి అడుగులోనే తేలిపోయిందని మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కెటిఆర్ హైకోర్టులో వేసిన క్వాష్ పిటీషన్‌ను పరిశీలించిన కెటిఆర్‌ను 10 రోజుల వరకు అరెస్ట్ చేయొద్దని ఉత్తర్వులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో తొలి అడుగులోనే కెటిఆర్ నైతిక విజయం సాధించారు. కెటిఆర్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని, ఇది డొల్ల కేసు అని మొదటి అడుగులోనే స్పష్టమైందని తెలిపారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు,అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇప్పుడు ఏదో శోధించినట్లు సిఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఆ డైవర్షన్‌లో భాగమే కెటిఆర్ మీద పెట్టిన కేసు అని పేర్కొన్నారు. ఈ రేవంత్ రెడ్డికి అటు విజన్ లేదు, ఇటు విజ్‌డమ్ లేదు. రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయం వల్ల తెలంగాణ ప్రతిష్ఠ దిగజారే పరిస్థితి వచ్చింది. ఇక్కడ ఇంటర్నేషనల్ రేస్ మూడేండ్లు జరగాల్సి ఉంటే, దాన్ని మధ్యంతరంగా రద్దు చేసిండు. ఈ పాటి దానికి, ఈ సుద్దపూస 2036లో హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తడట. కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తడన్నట్లు. ఆల్రెడీ ఒప్పందం అయి మూడేళ్ళ రేసు నిర్వహించే అవకాశం ఉన్న ఇంటర్నేషనల్ ఈవెంట్‌ను రద్దు చేసి, ఒలింపిక్స్ నిర్వహిస్తానని డబ్బా కొడుతున్నడు అని హరీశ్‌రావు సెటైర్లు వేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్థాంతరంగా రద్దు చేయడం వల్ల నష్టం జరిగిందని లండన్‌లో ప్రభుత్వం మీద కేసు వేసింది. ఆ కేసు గెలిస్తే రాష్ట్ర ప్రతిష్ఠ మరింత తగ్గుతది. ఇది కేటీఆర్ సంబంధించిన అంశం కాదు, నాలుగు కోట్ల ప్రజలకు సంబంధించినది. రాష్ట్ర ప్రతిష్ఠ, దేశ ప్రతిష్ఠ దిగజారింది. దిస్ విజన్ లెస్ చీఫ్ మినిస్టర్.. రూయిండ్ ద హైదరాబాద్ బ్రాండ్ అండ్ తెలంగాణ స్టేట్ ఇమేజ్. అప్పులు అప్పులు అని దివ్యంగా వెలుగుతున్న రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రం అన్నడు. ఇవాళ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు రాకుండా పోయినయి. ఉద్యోగ కల్పనకు దిక్కు లేకుండా పోయింది అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్ రేసుల వల్ల తెలంగాణకు రూ.600కోట్ల లాభం జరిగిందని, రూ.600 కోట్ల నష్టం కాదని పేర్కొన్నారు. అవినీతి జరగలేదని స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినప్పుడు ఇక ఏసీబీ కేసు ఎందుకు?హామీలపై ప్రజల దృష్టిని మరల్చి జిమ్మిక్కులు చేస్తున్నారని మండిపడ్డారు.

## అమెరికాలో తెలంగాణ యువకుడి మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 20:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని గౌడ్స్ కాలనీకి చెందిన పంజాల నీరజ్ గౌడ్ (23) అనే యువకుడు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఘటనలో జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్టకు చెందిన శ్రీధర్ అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సంవత్సరన్నర క్రితం వీరిద్దరు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి న్యూహెవెన్ సిటీలో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల 16న బ్రిడ్జిపోర్టు ప్రాంతానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా తీవ్రంగా మంచు కురుస్తుండడంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పోలీసు పెట్రోలింగ్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన నీరజ్ గౌడ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అమెరికా పెట్రోలింగ్ పోలీసు కారులోని సిబ్బందికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదు నిమిషాల్లో వీరు నివాసం ఉండే రూమ్‌కు చేరుకునే సమీపంలో ప్రమాదం చోటు చేసుకోవడం ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించ డానికి ప్రయత్నాలు చేస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

## నూతన జాతీయ విద్యావిధానం రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలి

### చలో అసెంబ్లీకి ప్రయత్నించిన ఎఐఎస్ఎఫ్

### అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** నూతన జాతీయ విద్యావిధానం రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. దాంతోపాటు రాష్ట్రంలో విద్యా వ్యవస్థ గందరగోళంగా ఉందని.. దానిని సరి చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టడానికి ప్రయత్నించి ఐఏఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ క్రమంలో విద్యార్థి నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఏఐఎస్ఎఫ్ నాయకుల ఛలో అసెంబ్లీ నేపథ్యంలో అసెంబ్లీ దగ్గర కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో ఫీజ్‌రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు.

# ఫార్ములా ఇ-కార్ రేసు కేసుపై ఎసిబి విచారణ వేగవంతం

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసు కేసుపై ఎసిబి విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణ నిమిత్తం ఎస్‌పి స్థాయి అధికారిని నియమించగా డిఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయనుంది. ఎసిబి డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి ఫార్ములా ఈ కార్ రేసు కేసును నిరంతరం పర్యవేక్షిస్తారు. ఈ కేసుకు సంబంధించి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా వున్న దానకిశోర్ ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై ఆయన వాంగ్మూలం తీసుకునేందుకు నిర్ణయించిన ఎసిబి అధికారులు ఇదే సమయంలో నాటి ఘటనలపై హెచ్‌ఎండిఎ అధికారులను కూ డా ప్రశ్నించనున్నారు. కాగా ఫార్ములా ఈ కార్ రేసులో కీలకంగా వున్న ఫియో ఎస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ప్రతినిధులను కూడా ఎసిబి అధికారులు వి చారించనున్నారు. ఈ సంస్థతో హెచ్‌ఎండిఎ కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను ఎసిబి విచారణ బృందం ఇప్పటికే తీసుకుని వాటిని పరిశీలించి అందులోని అన్ని అం శాలను కూలంకుశంగా తెలుసుకుంది. దీని తరువాతే ఫార్ములా ఈ కార్ రేసు కేసులో జరిగిన 55 కోట్ల రూపాయల చెల్లింంపులు అక్రమని ఎసిబి నిర్ధారణకు వచ్చిం ది. 2022 అక్టోబర్‌లో హైదరాబాద్‌లో ఫార్ములా వన్ కార్ రేస్‌లో భాగంగా మొదటగా ఫార్ములా ఈ కార్ రేస్‌ను నిర్వహించేందుకు నాటి బిఆర్ఎస్ సర్కారు నిర్ణయి ంచి, ఇందుకుగానూ ఫియో ఎస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 2023 ఫిబ్రవరి 10, 11వ తేదీలలో హైదరాబాద్‌లో ఈ రేస్ నిర్వహించగా ఈ రేస్ వల్ల ఆదాయం ఆశించినంతగా రాలేదని రేస్ నిర్వహించిన సంస్థ రెండవ దఫా రేస్ నుంచి వైదొలగింది. కాగా రెండవ దఫా రేస్‌ను సర్కారు నిర్వహించేందుకు ముందుకు వచ్చి స్పాన్సర్ కోసం వెతుకుతున్న తరుణంలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, బిఆర్ఎస్ ఓడి పోవడం ఫార్ములా ఈ కార్ రేసుపై నీలినీడలు కమ్ముకుని చివరకు ఇందులో కుంభకోణం జరిగిందని ఆరోపణలు వచ్చి ఆగిపోయింది. దీని తరువాత ఫార్ములా ఈ కార్ రేసుపై సర్కారు విచారణ కు ఆదేశించింది. దీని తరువాత 2024 ఫిబ్రవరి నెలలో జరగాల్సిన రెండవ దఫా రేస్ రద్దయ్యింది. అయితే అంతకు ముందు ఈ రేస్ కోసం నోడల్ ఏజెన్సీగా వున్న హెచ్ ఎండిఎ ఫియో ఎస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 55 కోట్ల రూపాయలను చెల్లించడం ఇందులో 45 కోట్ల రూపాయలు విదేశీ కరెన్సీ రూపంలో చెల్లించ డం దుమారం రేపింది. దీనిపై ఎసిబి విచారణకు సర్కారు ఆదేశించగా వెంటనే రంలో దిగిన అధికారులు హెచ్‌ఎండిఎ నుంచి ఫియో ఎస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి జరిగిన 55 కోట్ల రూపాయల చెల్లింపులు అక్రమని తేల్చాయి. ఈ విషయంలో నాటి సర్కారు అన్ని నిబంధనలకు కాలరాచిందని, ఆఖరుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి కూడా తీసుకోలేదని తేల్చింది. ఈ విషయంలో మొద టి ముద్దాయిగా వున్న నాటి పురకాలక శాఖ మంత్రి కెటిఆర్ వాదనలకు ఎలాంటి బల ం లేదని ఎసిబి తేల్చింది. విదేశీ కంపెనీకి జరిగిన 55 కోట్ల రూపాయల చెల్లింపులు హెచ్‌ఎండిఎ, జిహెచ్‌ఎంసిల మధ్య నిధుల సర్దుబాటులో భాగంగా జరిగాయని చె ప్పడం కూడా సరైంది కాదని, ఇందుకు సంబంధించి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేవని ఎసిబి విచారణలో తేలింది. ప్రభుత్వ నిధుల మళ్లింపులో అప్పట్లో ఎలాంటి నిబంధనలను పాటించలేదని ఎసిబి విచారణలో తేలింది. ఈ విషయంలో కెటిఆర్‌తో పాటు అప్పటి హెచ్‌ఎండిఎకు బాస్ సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, మరో సీనియర్ అధికారి బిఎల్ఎన్ రెడ్డిల తప్పిదం కూడా వుందని ఎసిబి విచారణలో తేలింది. ఈ కేసులో కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కు మార్, హెచ్‌ఎండిఎ విశ్రాంత అధికారి బిఎల్ఎన్ రెడ్డిలను విచారించేందుకు ఎసిబి సిద్ధమవుతోంది. ఫార్ములా ఈ కార్ రేసు కేసుపై ఎసిబి విచారణ చేయవచ్చుని హైకో ర్టు శుక్రవారం స్పష్టం చేసినందున దీనిపై ఏర్పడ్డ ప్రత్యేక దర్యాప్తు బృందం వివరాల సేకరణలో నిమగ్నమయ్యింది. ఇప్పటికే దీనికి సంబంధించి హెచ్‌ఎండిఎ సహా ఇతర విభాగాల నుంచి ఎసిబి కీలక సమాచారం సేకరించగా మిగతా వివరాలను రెండు మూడు రోజుల్లో సేకరించే వీలుంది.

> ఎస్‌పి నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు
>
> హెచ్‌ఎండిఎతోపాటు పలు శాఖల నుంచి పత్రాల సేకరణ

# ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తాం

### భూభారతి ప్రజల చట్టం

### అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నేత కేసీఆర్ తెలంగాణకు కాపలా కుక్కలా లేరని, రాష్ట్రాన్ని దోచుకునే వేట కుక్కలా వ్యవహరించారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో శుక్రవారం మధ్యాహ్నం భూ భారతి బిల్లుపై చర్చను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ చేసిన అక్రమాలను కప్పుపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా ఆ పార్టీ నేతలు అబద్ధాలు చెప్పి ఏదో విధంగా ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా సాంప్రదాయాలను మరిచి బీఆర్ఎస్ సభ్యులు రౌడీలు, గుండాల్లా ప్రవర్తిస్తున్నారని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓ దళిత స్పీకర్‌పై పుస్తకాలు విసిరారని, తనపై కూడా దాడి చేసేందుకు యత్నించారని ఆయన ఆరోపించారు. తెలంగాణకు కేసీఆర్ కాపలా కుక్కలా లేరని. ధరణిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని, నిజాలను నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ధరణి అక్రమాలు, భూ కుంభకోణాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని తేల్చిచెప్పారు. ధరణిలో జరిగిన అవకతవకలపై పరిశీలిస్తామని, తదుపరి అందులో వచ్చిన అంశాలను బట్టి ఏం విచారణ చేపట్టాలనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. భూ భారతి చట్టం ప్రజల చట్టమన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ధరణిని బంగాళాఖాతంలో కలిపామని వ్యాఖ్యానించారు. లోపభూయిష్టమైన ధరణి చట్టాన్ని ప్రక్షాళన చేయడం జరిగిందని తెలిపారు. భూ భారతి చట్టం వల్ల ప్రజలు, పేదలు, రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ధరణిలో అక్రమాలు చేసి లాక్కొన్న ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని తేల్చిచెప్పారు. సభను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ సభ్యులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అబద్ధాలతో కాలం గడపాలని బీఆర్ఎస్ యత్నిస్తుందని మండిపడ్డారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రారని, అదే సమయంలో ప్రతిపక్ష నేత పాత్ర కూడా పోషించరని విమర్శించారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని బీఆర్ఎస్ చూస్తుందని చెప్పారు. రౌడీలు, గూండాల్లా బీఆర్ఎస్ సభ్యులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో 1.50 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే భూములు చేతులు మారాయని ఆరోపించారు. లిటిగేషన్లో ఉన్న భూములను పార్ట్ బీలో పెట్టి ఆ భూములను సక్రమం చేసుకున్నారని తెలిపారు. దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని, పాకిస్తాన్ వెళ్లిపోయారని, అధికారులు నో అబ్జెక్షన్ చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అక్రమాలను నిగ్గు తేలుస్తామన్నారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారని ఆయన ఫైర్ అయ్యారు. అసెంబ్లీ రోజుకొక వేషంతో బీఆర్ఎస్ సభ్యులు డ్రామాలు ఆడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భూభారతి చట్టంపై చర్చ జరగకుండా బిఆర్ఎస్ కుట్ర

### ధరణిపేరుతో ఆర్థిక అవకతవకలు జరిగాయి

### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 20,ప్రభాతవార్త:** ధరణి చట్టం ఎంతో మంది ఉసురు తీసుకొందని రైతులకు భూ ఆసామిలకు భూమిపై భరోసా కల్పించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని ఈ చట్టం రూపొందబడకుండా బిఆర్ఎస్ కుట్రచేస్తున్నదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూభారతి ఆమోదం కోసం ప్రతిపాదిస్తూ సిద్దిపేట జిల్లా మద్దెలకృష్ణ(73) ధరణి కారణంగా ఆత్మహత్య చేసుకొన్న సంఘటను ఉదహరిస్తూ ఈ చట్టం ఎంతకాలం అమలులో ఉండటానికి వీలు లేదని తెలిపారు.ధరణితప్పులలో ఏలాంటి తప్పులు లేవని అప్పటి పెద్దలుబుకాయించారని ఇష్ఠంవచ్చినట్లు తన్నుకుపోయి ఎస్టీ ఎస్సీ బిసి పేదల భూములు తన్నుకుపోయారని ఆయన ఆవేదన చెందారు. ధరణి రెండుపిట్టలు, ఒక కోతి రొట్టెముక్క కథను చెప్పారు.

**బిఆర్ఎస్‌కు ప్రజా సంక్షేమం పట్టదు : శ్రీధర్‌బాబు**

భూభారతి ప్రజలకు ఉపయోగపడే బిల్లు బిఆర్ఎస్ ఇలా ఒక వ్యక్తి కోసం గొడవ చేయడం తగదు అని శాసనభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుఅన్నారు.




## హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఎల్ఐసి స్టాల్

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఎల్ఐసి స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలోని బుక్ ఫెయిర్‌లో శుక్రవారం లైఫ్ ఇన్సూరెన్స్ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తక ప్రియుల ప్రదర్శనలో ప్రచురణకర్తల భాగస్వామ్యం ఉందన్నారు. సందర్శించే ప్రజానీకం సమాజంలోని అన్ని వర్గాల వారు పాఠశాలలు, గృహస్తులు, వ్యాపారవేత్తల వంటి వారికి సంబంధించి పిల్లల నుండి నిపుణుల వరకు జీవిత బీమాపై అవగాహన కల్పించేందుకు ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. పాలసీల వివరాలతో పాటు, ఏజెన్సీలను సైతం ఇచ్చే అవకాశాన్ని కల్పించినట్లు వెల్లడించారు. మూడేళ్లపాటు స్థిర స్టైఫండ్‌తో. పురుషుడు లేదా స్త్రీని నియమించే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. సందర్శకుల్లో కొందరు జోనల్ మేనేజర్‌తో సంప్రదించి సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంకులు 4 రోజులు బంద్

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** కేంద్రం తెచ్చిన ఒకే రాష్ట్రం, ఒకే గ్రామీణ బ్యాంక్ నినాదం ప్రకారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుకు చెందిన తెలంగాణ బ్రాంచ్‌లు విలీనం కానున్నాయి. ఈ మేరకు గత నెల నవంబర్ లోనే ఈ విలీన నిర్ణయం తీసుకున్నాయి. దీంతో పలు బ్యాంకులు రాష్ట్రంలోని పెద్ద బ్యాంకుల్లో విలీనం కానున్నాయి. తెలంగాణలోని ప్రస్తుత తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లు సేవలందిస్తున్నాయి. ఒకే రాష్ట్రం, ఒకే గ్రామీణ బ్యాంక్ విధానంతో ఈ రెండు బ్యాంకులు కలిసిపోనున్నాయి. ఈ ఇందులో భాగంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ కలవనుంది. ఈ ప్రక్రియ జనవరి 1, 2025 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఈ క్రమంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు తమ శాఖపరమైన, ఆన్‌లైన్ సేవలు (యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏఈపీఎస్, సీఎస్పీ) అందుబాటులో ఉండవని తెలంగాణ గ్రామీణ బ్యాంకు తెలిపింది. ఈ క్రమంలో ఖాతాదారులు ఇబ్బంది పడకుండా ఈ నెల 27వ తేదీ లోపు ఆయా బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు పూర్తి చేసుకోవాలని కోరింది.

## అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

### రాహుల్‌గాంధీపై హత్యాయత్నం కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

### శాసనమండలి మీడియా పాయింట్‌లో మంత్రి పొన్నం



**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పార్లమెంట్ సాక్షిగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం శాసన మండలి మీడియా పాయింట్‌లో మరో మంత్రి దామోదర రాజనరసింహతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు అత్యున్నత వ్యవస్థ అని.. పార్లమెంటులోనికి ప్రవేశించే ద్వారం దగ్గర ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులను లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సహా ఇతర నాయకులను పార్లమెంటు లోపలికి పోకుండా దారికి అడ్డం నిల్చొని నిరోధించే ప్రయత్నం బీజేపీ ఎంపీలు చేశారని మంత్రి గుర్తు చేశారు. వారిని పక్కకు జరుపుకుంటూ పార్లమెంటు లోపలికి వెళ్లే సందర్భంలో .. పక్కన ఉన్నా పార్లమెంటు సభ్యుడు కాకుండా తరువాత ఉన్న సభ్యుడు కింద పడి చిన్న దెబ్బ తాకితే దానిపైన బీజేపీ కుట్ర పూరితంగా రాహుల్ గాంధీ క్యారక్టర్ దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందని మంత్రి మండిపడ్డారు. ఈ ఘటనను సాకుగా చూపుతూ రాహుల్ గాంధీని నేరస్తుడు అనే భావన తెచ్చే విధంగా హత్య ప్రయత్నం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై చర్చకు వేదికగా ఉండే పార్లమెంటు ద్వారం దగ్గరే అడ్డుకుంటున్నారంటే .. బీజేపీ వారి యొక్క కుట్రలు అరాచకం, నియంతృత్వం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పార్లమెంటుకి వచ్చి ఈ అంశంపై మాట్లాడాల్సింది పోయి అదీ చేయలేదని విమర్శించారు.

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమాన పరిస్తే అమిత్‌షాపై చర్యలు తీసుకోకుండా రాహుల్ గాంధీ నోరు మూయించేలా హత్య ప్రయత్నం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని ..అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్‌షా పై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

**భూముల ఆడిటింగ్ చేయాలి: అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ**

రాష్ట్రంలోని ప్రభుత్వ భూములపై ఆడిటింగ్ చేయించాలని ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ సూచించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును సభలోనే ఎండగట్టారు. ధరణి పోర్టల్ ఒక కుటుంబం కోసం, ఒక పార్టీ కోసమే తెచ్చారని ఆరోపించారు. భూముల ఆడిటింగ్ చేయించాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. తన డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

శాసనసభలో శుక్రవారం మధ్యాహ్నం బిఆర్ఎస్ సభ్యుల ఆందోళనల మధ్య ధరణిపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఫార్ములా ఈరేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు, స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును అక్బరుద్దీన్ ఓవైసీ తప్పు బట్టారు.

# ఆర్థిక నేరాలకు పాల్పడిన కంపెనీల ద్వారా దేశం దాటిన డేటా

> ధరణి పోర్టల్‌ను వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి ఆపరేట్ చేశారు
>
> లోపభూయిష్టమైన ధరణిని తెలంగాణ ప్రజలపై రుద్దిన కెసిఆర్
>
> కిషన్‌రెడ్డి ఫిర్యాదు చేసినా భూదాన్ భూములపై పట్టించుకోలేదు
>
> భూభారతి బిల్లుపై అసెంబ్లీలో ప్రసంగించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 20:** పేదల భూ హక్కులను కాపాడేందుకే భూ భారతి -2024 చట్టాన్ని తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన ప్రతీ భూ యజమానులు హక్కులు కాపాడేందుకు చట్టాన్ని సభలో ప్రవేశపెట్టాం.చర్చ జరగడం ద్వారా తెలంగాణ రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావలని భావించాం' అని తెలిపారు. అసెంబ్లీలో శుక్రవారం జరిగిన భూ భారతి బిల్లు చర్చలో ఆయన మాట్లాడుతూ భూముల కోసం ఎంతో మంది యోధులు త్యాగాలు చేశారు. అధికారం, అహంకారంతో కొంతమంది ఆధిపత్యం కోసం దాడులు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం సాయుధ పోరాటం చేశారని గుర్తుచేశారు. భూమి కోసం సకల జనులు పోరాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. చట్టాలతో యజమానుల హక్కులను కాపాడుకుంటూ వస్తున్నట్లు ప్రకటించారు. 'రావి నారాయణ రెడ్డి, అరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, భీం రెడ్డి నర్సింహారెడ్డి,చాకలి ఐలమ్మ లాంటి వారు పోరాటాలు చేసింది భూమి కోసమే.ఈ భూమిని ఆత్మగౌరవంగా, హక్కుగా భావించారు.అధికారంతో, అహంకారంతో ఆధిపత్యాన్ని చేలాయించాలని చూసినా భూమిని కాపాడుకోవడంలో వారు విజయం సాధించారు' అని చెప్పారు.ఆ తరువాత ఎప్పుడు ఏ ఉద్యమం వచ్చినా భూమి చుట్టూనే పోరాటాలు జరిగాయి. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుకు కూడా కొంతమంది భూమిపై ఆధిపత్యం చెలాయించడమే కారణం,యజమాని హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయి' అని చెప్పారు. నిజమైన భూ యజమాని హక్కులను కాపాడాలి.లేకపోతే చదువులేని వారి భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది.వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు వీలైనంత మేరకు ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వాలు చట్టాలు సవరించాయని చెప్పారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను పీవీ నరసింహా రావు తీసుకొచ్చారన్నారు. ఇందిరా హయాంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీ జరిగిందని వివరించారు. యూపీఏ హయాంలోనే భూభారతి పేరుతో దేశవ్యాప్తంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు గుర్తుచేశారు. నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్ట్ శ్రీకారం చుట్టారని సీఎం అన్నారు. 'తన మెదడును రంగరించి మాజీ సీఎం కేసీఆర్ ఒక అద్భుత చట్టాన్ని తీసుకొస్తున్నామని ఆనాడు సభలో చెప్పారు.ధరణి పోర్టల్ కేసీఆర్ సొంతంగా కనిపెట్టింది కాదు.2010లోనే ఒడిస్సాలో ఈ-ధరణి పేరుతో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి అప్పగించింది.అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు ఈ- ధరణి పోర్టల్ ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పుపట్టింది.అలాంటి లోపభూయిష్టమైన ధరణిని కేసీఆర్ ఎందుకు తెలంగాణ ప్రజలపై రుద్దారో చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంద'ని వివరించారు.

'2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌తో పాటు గాదె శ్రీధర్ కు చెందిన ఈ సెంట్రిక్,విస్సెన్ ఇన్ఫోటెక్ సంయుక్తంగా కాంట్రాక్టు సాధించుకున్నాయి. క్రిమినల్ నేపథ్యం ఉన్న కంపెనీలను టెండర్లలో నిషేధించే విధానం ఉంది..కానీ కేసీఆర్ ఆ పని చేయలేదు' అని చెప్పారు.'భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారు.ఆ తరువాత ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సబ్సిడరీ కంపెనీ అయిన టెరాసిస్ ధరణి కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ టెరాసిస్ లో 99 శాతం షేర్లు ఫిలిప్పిన్స్ దేశానికి చెందిన ఫాల్కాన్ ఎస్‌జి అనే సంస్థ రెండు దఫాలుగా 2021 లో కొనుగోలు చేసింది. మిగిలిన ఒక్క శాతం వాటా మాత్రం కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్ రాజు కొనుగోలు చేశారు' అని చెప్పారు 'ఆ ఒక్క శాతం షేరుతో శ్రీధర్ రాజు టెరాసిస్ కు సీఈవోగా అవతారం ఎత్తారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్, భూ యజమానికి మధ్య ఉండాల్సిన డేటాను డిజిటల్ పోర్టల్ నెపంతో ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర దేశాల్లో ఆర్థిక నేరాల్లో ఇరుక్కుపోయిన సంస్థలకు అప్పగించి.. రైతుల సంపూర్ణ డేటాను వాళ్ల చేతుల్లో పెట్టారు.ఇది ఎంత తీవ్రమైన నేరమో ఒక్కసారి ఆలోచించాలి' అని పేర్కొన్నారు.

'ధరణిలో ఎన్నో ఎకరాల భూదాన్ భూములు, ప్రయివేట్ భూముల యజమానుల పేర్లు మారాయి..అగ్రిమెంట్ లోని 9.20 క్లాజ్ ప్రకారం యజమాని పేరు మార్చడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి.9.20.4 క్లాజ్ లో పేర్కొన్నట్లు ప్రభుత్వ ఆఫీసులో ఉండి పనులు చేయాలి..రెవెన్యూ శాఖకు సంబంధించిన సీసీఎల్ఏ కార్యాలయం నుంచి పని చేయాలి.తెలంగాణలో కాకుండా విజయవాడలో, బెంగుళూరుకు, ఈశాన్య రాష్ట్రాల నుంచి ధరణిని నిర్వహించారు' అని దుయ్యబట్టారు.'ఈ రాష్ట్రంలో,ఈ దేశంలో లేని కంపెనీలకు, విదేశీయులకు అప్పగించి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు.దీనిపై ఎంత కఠినమైన శిక్ష వేయాల్సిన అవసరం ఉందో ఆలోచన చేయాలి...గోప్యంగా ఉంచాల్సిన సమాచారం ఆ వ్యక్తికి తెలియకుండా ఎవరికీ ఇవ్వొద్దని చట్టాలు చెబుతున్నాయి.కానీ కేసీఆర్, కేటీఆర్ ఇతర దేశాల వ్యక్తులకు ఈ సమాచారం అప్పగించారు..ఇంత ఎంత తీవ్రమైన నేరం..?' అని ప్రశ్నించారు.గతంలో ధరణిలో పగలు జరగాల్సిన రిజిస్ట్రేషన్ లు అర్ధరాత్రి కూడా జరిగాయి..అర్ధరాత్రి రిజిస్ట్రేషన్ లు చేసే వ్యవస్థ ఏ రాష్ట్రంలోనైనా ఉందా..?బండారం బయటపడుతుందనే సభలో చర్చ జరగకుండా ప్రయత్నాలు చేశారు.ఆనాడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫిర్యాదు చేసినా ... లెక్కచేయకుండా తిమ్మాపూర్ భూదాన్ భూములను ప్రయివేట్ వ్యక్తుల పేరుకు మార్చారు..మా ప్రభుత్వం వచ్చాక కేసులు నమోదు చేశాము..రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వేల ఎకరాల భూములను బదిలీ చేశారు..ఎక్కడి నుంచైనా , ఏ పేరుకైనా మార్చేలా స్వైర విహారంచేసే అధికారం ధరణి నిర్వహణ సంస్థకు అప్పగించారు' తప్పుపట్టారు. ధరణి అద్భుతమైతే సభలో ఉండి మమ్మల్ని నిలదీయాలి కదా...?80వేల పుస్తకాల జ్ఞానంతో సృష్టించిన ధరణి గురించి సంపూర్ణంగా వివరించచ్చు కదా..ఎట్టి పరిస్థితుల్లో చర్చ జరగొద్దని తొండి చేయాలని ప్రయత్నించి వెళ్లిపోయారు అని పేర్కొన్నారు.

## కొబ్బరి కురిడీలకు కనీస మద్దతుధర పెంపు

### క్వింటాలుకు రూ.12,100 గా కేబినెట్ సిఫారసు



**న్యూఢిల్లీ, డిసెంబరు 20:** కొబ్బరి కురిడీ కనీస మద్దతుధరను క్వింటాలుకు 420 రూపాయలు పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. కొబ్బరి కురిడీ క్వింటాలుకు 12,100 రూ పాయలుగా ధరలు నిర్ణయించింది. ఇందు కోసం బడ్జెట్‌లో 855 కోట్లుకేటాయించినట్లు తెలిపింది. కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ ప్రధాని నరేంద్రమోడీ అధ్య క్షతన సమావేశం అయి కొబ్బరికురిడీ కనీస మద్దతుధరను పెంచింది. 2025 సంవత్సరానికి గాను చిప్పల మాదిరి గా ఉన్న కురిడీలకు 100 రూపాయలు పెంచి క్వింటాలుకు 12,100గా నిర్ణయించినట్లు సమాచారమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకోసం కేంద్ర బడ్జెట్‌కు 855 కోట్లరూపాయలుఅదనపు కేటాయింపులు అవసరం అవుతాయన్నారు. సహకార ఏజెన్సీలు, నాఫెడ్;ఎన్‌సిసిఎఫ్ వంటి ఏజెన్సీలు కోప్రా కొనుగోలుకు నోడల్ ఏజెన్సీలుగా ఉంటాయని మంత్రి వివరించారు.

